సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



కదులుతున్న డొంక

తంబళ్లపల్లి నియోజకవర్గంలోని పెద్దతిప్ప సముద్రం మండలంలో మహిళా సంఘాల నిధుల దుర్వినియోగంలో ఆడిట్ బృందం తీగ లాగితే డొంక కదులుతోంది. - 8లో



అన్నదాత గుండె చెరువు.!

కురబలకోట మండలంలోని దిగవశీతివారిపల్లె పక్కనున్న శీతివారిపల్లె చెరువు ఆదివారం తెగి వరదలా ప్రవాహం పోటెత్తింది. దీనిపై అధి కారులు విచారణ చేపట్టారు. - 8లో



మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.228
రెండోరకం	రూ.80	రూ.158

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 214 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	426	466
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 854.440 కిలోలు

న్యూస్‌రీల్

ఉత్సాహంగా క్రీడాపోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

రాజంపేట : రాజంపేట ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాల క్రీడామైదానంలో కడప రీజియన్ స్థాయిలో స్పోర్ట్స్, గేమ్స్ సోమవారం ప్రారంభ మయ్యాయి. ఈ పోటీలకు కడప రీజియన్ పరిధిలోని 13 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలలకు చెందిన 362 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను డీఎస్పీ చైతన్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. డీఎస్పీతో ఏపీఎస్పీడీసీఎల్ డీఈ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ భక్తవత్సలం, ప్రిన్సిపాల్ డా.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ ఉద్దండం సుబ్రమణ్యం, ఫిజికల్‌డైరెక్టరు సుజాత, 14 కళాశాల పీడీలు పాల్గొన్నారు.

విద్యార్థినికి అవార్డు



అవార్డు అందుకుంటున్న అఫ్రీన్‌తాజ్

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థిని అఫ్రిన్‌తాజ్ బి.ఏలో 2022–23 సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించినందుకు ఉత్తమ అకడమిక్ ఫెస్ట్ అవార్డు అందుకున్నారు. అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ నుంచి అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందుకుంది. విద్యార్థిని అఫ్రీన్‌తాజ్‌ను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి,అధ్యాపకులు అభినందించారు.

నూతన నియామకం



భాస్కర్‌రెడ్డి

తంబళ్లపల్లె : సెంట్రల్ రైల్వేస్టేషన్ సలహామండలి సభ్యులుగా కన్నెమడుగు పంచాయితీ కె.రామిగానిపల్లెకు చెందిన ఎ.భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. గుంతకల్లు సెంట్రల్ రైల్వే డివిజన్‌లోని కురబలకోట రైల్వేస్టేషన్ సలహామండలి సభ్యులుగా భాస్కర్‌రెడ్డిని నియమిస్తూ సెంట్రల్‌రైల్వే అసిస్టెంట్, కమర్షియల్ మేనేజర్ రవి నియామకపత్రం అందజేశారు. ఈయన 2024 డిసెంబర్ 31వ తేదీ వరకు సలహామండలి సభ్యులుగా కొనసాగుతారన్నారు.

వైభవం.. పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి ఆలయం మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి ఆలయ మాఢవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలం రెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరధరామిరెడ్డి, ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి, కష్ణ స్వామి, చంద్రశేఖర్ స్వామి పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

రాయచోటి టౌన్ : వినియోగదారుల వారోత్సవాలు ఈనెల18వ తేదీ ప్రారంభమయ్యాయి. ఈనెల 24 వరకు జరగనున్నాయని జిల్లా ఇన్‌చార్జి డీఈవో ఎం. ప్రసాద్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మండల విద్యాశాఖాధికారులు, డిప్యూటీ విద్యాశాఖ అధికారులు పాల్గొనాలని తెలిపారు.

వైవీయూలో క్రీడా జట్ల ఎంపిక

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయంలో క్రీడా జట్ల ఎంపిక డిసెంబర్ 20 నుంచి నిర్వహించనున్నట్లు క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ రామసుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. డిసెంబర్ 20న ఖోఖో (స్త్రీ, పురుషులు), డిసెంబర్ 21న ఉదయం హాకీ పురుషులు, మధ్యాహ్నం 2 గంటలకు పు ట్‌బాల్ పురుషుల జట్లు ఎంపిక నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులు వయసు, ప్రస్తుతం చదువుతున్న కోర్సు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు.

పేదలకు ఆరోగ్య భద్రత

- జిల్లాలో కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ
- డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానమ్, జిల్లా కలెక్టర్ గిరీషా, మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎస్పీ కృష్ణారావు తదితరులు

రాయచోటి : జిల్లాలో సోమవారం నుంచి కొత్త ఫీచర్లతో కూడిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య వ్యయపరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ఈ విషయంపై అవగాహన కల్పిస్తూ.. సరికొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల పంపిణీని సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం, మదనపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ నవాజ్ బాషా, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్‌చైర్మన్ ఫయాజుర్‌రెహమాన్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్, డీఎంహెచ్ఓ డాక్టర్ కె.కొండయ్య, డీసీహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్‌లు హాజరయ్యారు.ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద 1059 వ్యాధులకు మాత్రమే ఉన్న పరిధిని 3257 వ్యాధులకు ప్రభుత్వ విస్తరించింది. పేద మధ్య తరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్‌వైద్యం అందించే దిశలో ఇకపై వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నేడు శ్రీకారం చుట్టారన్నారు.

జిల్లాకు 2,91,245 ఆరోగ్యశ్రీ కార్డులు

అన్నమయ్య జిల్లాకు సంబంధించి 4,61,553 అర్హులైన కుటుంబాలకు 2,91,245 కొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ కార్డులను నేటి నుంచి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులకు దిక్సూచి ఇలా పనిచేసే ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించే విధంగా కృషి చేయాలన్నారు. తద్వారా ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం ఎలా చేయించుకోవాలి. ఎక్కడకు వెళ్లాలి ఆరోగ్యశ్రీసేవలు ఎలా పొందాలి. ఎవరిని అడగాలి అనే ఇలాంటి సందేహాలన్నింటికీ అవగాహన కలిగేలా ప్రతి ఇంట్లో వివరించాలని ఏఎన్‌ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశావర్కర్‌లకు సూచించారు. ప్రజాప్రతినిధులు ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో జనవరి 1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కూడా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

- శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్య-వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యాన్ని పేద ప్రజలకు అందుబాటులోకి తెచ్చారన్నారు.ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే కార్యక్రమానికి సీఎం నేడు శ్రీకారం చుట్టడం సంతోషించదగ్గ విషయం అని అన్నారు.ఆసుపత్రుల రూపురేఖలు మార్చేశారన్నారు.
- మదనపల్లె ఎమ్మెల్యే మహమ్మద్ నవాజ్‌బాషా మాట్లాడుతూ ఇక నుంచి డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరిస్తూ రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించాలని దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం జగన్ రాష్ట్ర చరిత్రలో చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. వైద్యరంగంపై ప్రత్యేక దృష్టితో స్పెషలిస్ట్ వైద్యులను అందుబాటులోకి తెచ్చారు. ఆరోగ్యశ్రీలో చికిత్స చేయించుకున్న వారికి ఆరోగ్య ఆసరా కింద చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు విశ్రాంతి తీసుకునే సమయంలో రోజుకు రూ.225 చొప్పున నెలకు గరిష్టంగా రూ.5 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తూ దేశానికే జగనన్న ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందన్నారు.
- జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగానికి ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా పోలీసుల ద్వారా దిశా యాప్ డౌన్‌లోడ్‌తో పాటు ఆరోగ్యశ్రీ యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేయించడంపై దృష్టి సారిస్తామన్నారు.
- మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా మాట్లాడుతూ తండ్రి అడుగుజాడల్లో ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పేద ప్రజల పట్ల ఉన్న అంకితభావాన్ని తెలియజేస్తుందన్నారు. ఆరోగ్య సమస్య ఎదురైనా, ప్రమాదానికి గురైనా డాక్టర్ వైఎస్ ఆర్ ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యం పొందడం ఇప్పుడు మరింత సులభతరం అయ్యిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, శాసనమండలి ఉపాధ్యక్షురాలు, మదనపల్లె ఎమ్మెల్యే, జిల్లా ఎస్పీ, మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌ల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



జిరాక్స్ సెంటర్ నడుపుకుంటూ జీవితం సాగిస్తున్నాను. అంతంత మాత్రం ఆర్థిక ఆదాయం ఉన్న నాలాంటి కుటుంబంలో అనారోగ్యాలు వస్తే జీవితం అతలాకుతలం అవుతుంది. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నాలుగేళ్ల మా పాపకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రిలో రూ.2 లక్షల విలువతో గుండెకు స్టంట్ అమర్చే వైద్యాన్ని ఉచితంగా అందించారు. అంతేగాక ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఓపెన్ హార్ట్ సర్జరీ కూడా చేశారు. నాలాంటి పేదలకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– కె.ఖాదర్‌వల్లి, బోస్‌నగర్, రాయచోటి

ఆరోగ్యశ్రీతో ప్రాణం నిలబడింది



అనారోగ్యంతో బాధపడుతున్న నాకు ప్రైవేటుగా చికిత్స చేయాలంటే ఎంతో ఖర్చు అవుతుంది. వైద్య ఖర్చులు కుటుంబానికి భారం అవుతున్న సమయంలో.. ఆరోగ్యశ్రీ కింద రూ.2 లక్షల ఖర్చుతో గుండెకు స్టంట్ అమర్చారు. డయాలసిస్‌కు ఉచితంగా చికిత్సను ప్రభుత్వం అందించింది. ఆరోగ్య ఆసరా కింద కూడా ఆర్థిక సహాయం అందించారు.ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరిస్తూ రూ.25 లక్షల వరకు పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందించాలని సీఎం తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు.పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్న ముఖ్యమంత్రి పదికాలాలు చల్లగా ఉండాలి.

– షాహిద్ పర్వీన్, వినాయకవీధి, రాయచోటి

శబరిమలైకి ప్రత్యేక సర్వీసులు

బస్సు రకం	సీట్ల సంఖ్య	కిలోమీటరుకు అద్దె
సూపర్ లగ్జరీ	36	రూ. 57
అల్ట్రా డీలక్స్	40	రూ. 61
ఎక్స్‌ప్రెస్	49	రూ. 62

కడప కోటిరెడ్డిసర్కిల్ : శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. బ్యాచ్‌లుగా వచ్చిన వారికి కోరిన రూట్లలో తక్కువ చార్జీతో బస్సులను నడుపుతామని ఆయన పేర్కొన్నారు. గురుస్వామి, వంట మాస్టర్, లగేజీ బాయ్, కన్నెస్వామి మొత్తం ఏడుగురికి ఉచిత ప్రయాణానికి అనుమతిస్తామన్నారు. అలాగే వివాహాలకు, ఇతర శుభ కార్యాలకైనా ఏపీఎస్ ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన బస్సులను నడుపుతుందన్నారు. వివరాలకు కడప డీఎం (9959225774), బద్వేలు (99592 25779), జమ్మలమడుగు (99592 25778), పులివెందుల (99592 25780), మైదుకూరు (99592 25781), ప్రొద్దుటూరు (99592 25777)లను సంప్రదించవచ్చని వివరించారు.

అరుణాచలానికి..

అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం తిరుమన్నామలైకి వివిధ డిపోల నుంచి ఈ నెల 25, 26 తేదీలలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప డిపో నుంచి రాత్రి 9 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా బస్సు బయలుదేరుతుందన్నారు.
- బద్వేలు డిపో నుంచి 25న రాత్రి 8 గంటలకు బయలుదేరి గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా, 26న ఉదయం 5.30, 7.30 గంటలకు పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా బస్సులు బయలుదేరుతాయన్నారు.
- మైదుకూరు డిపోలకు సంబంధించి పోరుమామిళ్ల నుంచి ఉదయం 6 గంటలకు మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా బస్సులు వెళతాయన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి రాత్రి 8.30కి బయలుదేరి మైదుకూరు, కడప మీదుగా వెళతాయన్నారు.
- జమ్మలమడుగు డిపో నుంచి రాత్రి 8కి బస్సు బయలుదేరుతుందన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లాలో మూడు రోజులు పర్యటించే అవకాశాలు ఉన్నాయని, అందుకు తగ్గట్లు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీలలో సీఎం జిల్లాలో పర్యటించే అవకాశం ఉందన్నారు. అధికారికంగా మినిట్ టు మినిట్ షెడ్యూల్ అందాల్సి ఉందన్నారు. గోపవరం, కడప, ఇడుపులపాయ, సింహాద్రిపురం, పులివెందులలో వివిధ కార్యక్రమాల్లో సీఎం పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే అధికారులకు తగిన బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రంలో కొత్తగా 1500 ఆర్టీసీ బస్సులు

కడప ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి

పీలేరురూరల్ : రాష్ట్రంలో కొత్తగా 1500 ఆర్టీసీ బస్సులు రానున్నట్లు కడప ఇన్‌చార్జి ఈడీ చెంగల్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ సర్వీసులు నడిపి ప్రజల ఆదరణ పొందాలన్నారు. ఖర్చు తగ్గించి ఆదాయం పెంచాలన్నారు. ఆర్టీసీ అంతర్‌రాష్ట్ర ఒప్పందం కుదురుతోందని, తద్వారా పీలేరు వయా మదనపల్లె మీదుగా బెంగుళూరుకు పది సర్వీసులు నడుపుతామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ డిపోల నుంచి 300 సర్వీసులు అరుణాచలం గిరి ప్రదక్షణకు నడుపుతున్నామని, 500 సర్వీసులు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పీలేరు డిపో నుంచి శబరిమలై యాత్రకు 15 సర్వీసులు, అరుణాచలానికి ప్రతి నెలా 20 సర్వీసులు నడిపేందుకు కృషి చేయాలన్నారు. అన్నమయ్య జిల్లాలో ఈ ఏడాది అరుణాచలానికి 179 సర్వీసులు నడపగా రూ. 60 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్గో ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ. 150 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎం రాము, డీఎం కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వైవీయూ డిగ్రీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఈ నెల 20వ తేదీ నుంచి 1, 3, 5 సెమిస్టర్ డిగ్రీ పరీక్షలు ప్రారంభమవుతాయని విశ్వ విద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి వెల్లడించారు. జిల్లాలోని 79 డిగ్రీ కళాశాలల్లో బిఏ, బీబీఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ, బీఒక్ కోర్సులు చదివే రెగ్యులర్, సప్లమెంటరీ కలిపి 35,562 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 56 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య మార్గదర్శకంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సెమిస్టర్ల వారీగా మొదటి సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులు 7,313 మంది కాగా సప్లమెంటరీ 5324 మంది ఉన్నారన్నారు. మూడో సెమిస్టర్‌కు రెగ్యులర్ 5240 మంది, సప్లమెంటరీకి 6056 మంది ఉన్నారని తెలిపారు. ఐదో సెమిస్టర్‌కు రెగ్యులర్ 9103, సప్లిమెంటరీకి 2522 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. విశ్వ విద్యాలయం అబ్జర్వర్లను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు నిబంధనలు పాటిస్తూ పరీక్షలకు హాజరు కావాలని వివరించారు.

తిరుమలకు చేరుకున్న ఆకేపాటి




జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పాదయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తబృందం

తిరుమల : శేషాచలం ఆటవీప్రాంతంలోని అన్నమయ్య నడకమార్గం మీదుగా భక్తబృందంతో కలిసి ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తిరుమలకు చేరుకున్నారు. ఈ నెల 15వ తేదీన రాజంపేట నుంచి వేలాది మందితో ఆయన 21వ సారి తిరుమలకు మహాపాదయాత్రను ప్రారంభించారు. శేషాచలం అటవీప్రాంతంలో నుంచి అన్నమయ్య నడిచి వచ్చిన మార్గం మీదుగా.. ఆకేపాటి సోమవారం తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ అన్నమయ్య నడిచిన కష్టతరమైన ఈ మార్గంలో 21వ సారి కాలినడకన తిరుమలకు వచ్చామని తెలిపారు. అన్నమయ్య మార్గాన్ని అభివృద్ధి చేయాలని టీటీడీని, ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. తిరుమలకు చేరుకున్న ఆయనకు ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారందరూ శ్రీవారిని ఉచిత సర్వదర్శన మార్గం ద్వారా దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

విస్తారంగా ఉలవ సాగు

- జిల్లాలో 16,040 హెక్టార్లలో సాగు చేసిన రైతులు
- 80 శాతం రాయితీతో 11,469 క్వింటాళ్ల ఉలవల పంపిణీ
- అన్నదాతకు ప్రోత్సాహం అందించిన ప్రభుత్వం



పీలేరురూరల్ : వర్షాభావంతో 2023–24 ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసుకోలేని రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ఉలవసాగు చేసుకోవడానికి ప్రోత్సహించింది. జిల్లాలో 400 రైతు భరోసా కేంద్రాల ద్వారా 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేయడంతో రైతు ఆసక్తి చూపారు. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ఉలవ సాగు చేసుకుంటే వాతావరణంలోని మంచును ఉపయోగించుకుని డిసెంబర్, జనవరి నెలల్లో పంట వస్తుంది. ఎకరాకు నాలుగు నుంచి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ ఉలవలు రూ. 100 పలుకుతోంది. జిల్లాలో 46,954 మంది రైతులు 16,040 హెక్టార్లలో ఉలవ సాగు చేశారు. జిల్లాలో సాధారణ ఉలవ సాగు విస్తీర్ణం 7534 హెక్టార్లకు కాగా 212 శాతం అధికంగా ఉలవ సాగు చేశారు. ఉలవ సాగుకు వాతావరణం బాగా అనుకూలించడంతో మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





పీలేరు మండలంలో ఉలవసాగు

యాజమాన్యపద్ధతులు...

పొలాన్ని దుక్కి చేసిన అనంతరం ఉలవను విత్తన శుద్ధి చేసుకుని సమపాళ్లలో చల్లాల్సి ఉంటుంది. ఉలవ సాగు అన్ని రకాల భూముల్లోనూ అనుకూలంగా ఉంటుంది. ఎకరా పొలానికి 40 కేజీల విత్తనాలు వేయాల్సి ఉంటుంది. ఒక హెక్టారుకు 5 టన్నులు సేంద్రియ ఎరువులు, 22 కేజీల యూరియా వాడాలి. 90 నుంచి 110 రోజుల్లో దిగుబడి వస్తుంది. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ఉలవలతో ప్రయోజనాలు...

- ఉలవలు పురాతనమైన పప్పుదినుసుల పంట. ఇందులో మాంసకృతులు ఎక్కువగా ఉంటాయి.
- వీటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా జీర్ణశక్తిని పెంపొందిస్తుంది.
- మధుమేహం వ్యాధిని తగ్గించడానికి, కిడ్నీలో రాళ్లు రాకుండా నివారించడానికి ఉలవలు ఉపయోగపడుతాయి.
- పాడి రైతులకు తమ పశువుల పెంపకానికి పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది.

రాయితీతో ఉలవలు పంపిణీ చేశాం



ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేయని రైతులకు అనువుగా జిల్లాలో ఆర్‌బీకేల ద్వారా 11,469 క్వింటాళ్ల ఉలవలు 80 శాతం రాయితీతో పంపిణీ చేశాం. ఈ ఏడాది మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

– బి. చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి

భూసారం పెరుగుతుంది



ప్రస్తుతం కరువు పరిస్థితుల దృష్ట్యా ఉలవ పంట సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. తరువాత సాగు చేసే పంటలకు భూమి అనువుగా మారి దిగుబడి బాగుంటుంది. రైతులకు పశుగ్రాసం కొరత కూడా తీరుతుంది. ప్రస్తుతం మార్కెట్ ఉలవలకు మంచి డిమాండ్ ఉంది.

– రమణరావు, ఎ.డి.ఎ, పీలేరు.

1.75 ఎకరాలో ఉలవ సాగు...



ఖరీఫ్‌లో వర్షాలు కురవకపోవడంతో మాకు ఉన్న 1.75 ఎకరా పొలం ఖాళీగా ఉంచాం. 80 రాయితీతో ప్రభుత్వం ఉలవలు పంపిణీ చేసింది. దీంతో ఉలవసాగు చేశాం. వర్షాలు కూడా కురవడంతో పంట బాగా ఉంది.

–ఎస్.రత్నమ్మ, గడ్డగుంటపల్లె, పీలేరు మండలం

క్లుప్తంగా

వీరభద్రస్వామిని దర్శించుకున్న వైవై రెడ్డి



శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో డాక్టర్ వైవై రెడ్డి

రాయచోటి టౌన్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ క్వార్టర్స్ చీఫ్ డాక్టర్‌గా వ్యవహరించిన యర్రపురెడ్డి ఎరుకలరెడ్డి(వైవై రెడ్డి) సోమవారం రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈఓ డీవీ రమణా రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథ రామిరెడ్డిల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులు, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా ఆయన రాయచోటి నియోజకవర్గం మొదటి ఎమ్మెల్యే యర్రపురెడ్డి ఆదినారాయణ రెడ్డి మూడవ కుమారుడు కావడం విశేషం.

రోడ్డుప్రమాదంలో కార్పెంటర్‌కు తీవ్రగాయాలు



రోడ్డుప్రమాదంలో గాయపడ్డ కార్పెంటర్

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో కార్పెంటర్ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. బి.కొత్తకోట పట్టణం హడ్కో కాలనీకి చెందిన కె.బాలకృష్ణ (36), అతడి స్నేహితుడు బాబ్‌జాన్ (40) ఇద్దరూ కలిసి వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి బి.కొత్తకోటకు వెళుతుండగా, అమ్మచెరువుమిట్ట వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో బాలాజీకి తీవ్రగాయాలు కాగా, స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొన్న కారు



రోడ్డుప్రమాదంలో గాయపడిన వెంకట్రమణనాయుడు

గుర్రంకొండ : రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లెలో జరిగింది. సోమవారం గ్రామానికి చెందిన డి.వెంకట్రమణనాయుడు(55) రోడ్డుకు అవతలివైపు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా రాయచోటి నుంచి గుర్రంకొండకు వస్తున్న ఏపీ04 బీబీ 9279 అనే కారు ఢీకొంది. ఈ సంఘటనలో వెంకట్రమణ నాయడు నడుము, భుజంపై తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. డ్రైవర్ జావీద్ అలీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

కదులుతున్న డొంక.!

- మహిళా సంఘాల్లో మరో రూ.35 లక్షల నిధులు స్వాహా
- సంఘమిత్రల నుంచి సమగ్ర వివరాలు సేకరించిన ఆడిట్ బృందం
- ఇప్పటికి 8 వీఓల్లోనే రూ.55 లక్షల నిధులు పక్కదారి
- మండలం అంతా విచారణ చేపడితే స్వాహా సొమ్ము రూ.కోటికి పైగా ఉండే అవకాశం



పెద్దతిప్పసముద్రంలోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం

పెద్దతిప్పసముద్రం : మహిళా సంఘాల్లో నిధుల దుర్వినియోగం విషయంలో ఆడిట్ బృందం తీగ లాగితే డొంక కదులుతోంది. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం మండలంలో పనిచేస్తున్న సంఘమిత్రలు గ్రూపు సభ్యుల నుంచి చేతివాటం ప్రదర్శించిన సొమ్ము నుంచి సీసీలతో పాటు ఏపీఎంలకూ వాటాలిచ్చినట్లు ఆరోపణలు దుమారం లేపాయి. ఈ వ్యవహారంపై గత కొద్ది నెలల క్రితం స్త్రీ నిధి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (సీఐఎఫ్) సొమ్ము మాయాజాలం వ్యవహారంపై నాలుగు ప్రత్యేక బృందాల సభ్యులు కలసి సమగ్రంగా ఆడిట్ నిర్వహించారు. కేవలం నాలుగు గ్రామ సమాఖ్యల పరిధిలో ఉన్న మహిళా సంఘాల గ్రూపు రికార్డులను పరిశీలించి ఆడిట్ నిర్వహించగా రూ.20.31 లక్షల సొమ్ము స్వాహా అయినట్లు బట్టబయలైంది. ఇందులో కొంత మొత్తం రికవరీ కూడా చేశారు. డీఆర్‌డీఏ జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక బృంద సభ్యులతో మండలమంతా సమగ్రంగా ఆడిట్ నిర్వహిస్తే రూ.కోటికి పైగా స్వాహా సొమ్ము వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇన్నాళ్లూ గడువు ముగిసినా స్త్రీ నిధి, సీఐఎఫ్ రుణాల రికవరీలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ, రుణాలు పొందిన సభ్యుల నుంచి వసూలు చేసిన నెలవారి కంతుల సొమ్మును బ్యాంకులకు జమ చేయకుండా మీనవేషాలు లెక్కించే సంఘమిత్రలు ఆడిట్‌తో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గుట్టుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో పీడీ ఆదేశాల మేరకు డీఎంజీ, డీపీఎం, స్త్రీ నిధి మేనేజర్, ఓ ఏపీఎంతో పాటు 10 మంది సీసీల బృందంతో కూడుకున్న సభ్యులు గత 25 రోజుల నుంచి మండలంలోని పులికల్లు, పట్టెంవాండ్లపల్లి టూ, పట్టెంవాండ్లపల్లి త్రీ, తుమ్మరకుంట వీఓల్లో ఆడిట్ నిర్వహించగా రూ.35 లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు వెల్లడైంది.

గ్రామ సమాఖ్యలు 34.. సంఘమిత్రలు 37 మంది

మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో 1,205 మహిళా సంఘాలు ఉన్నాయి. 12 వేల మందికి పైగా మహిళలు గ్రూపుల్లో సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈ సంఘాలన్నీ 34 గ్రామ సమాఖ్యల (వీఓ)ల పరిధిలో ఉండగా 37 మంది సంఘమిత్రల పర్యవేక్షణలో ఈ సంఘాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కేవలం 8 వీఓల్లో మాత్రమే ఆడిట్ నిర్వహించారు.

సంఘమిత్రల నుంచి సమగ్ర వివరాల సేకరణ

దుర్వినియోగమైన నిధుల విషయంపై ఆడిట్ బృందం సంఘమిత్రల నుంచి సమగ్రంగా వివరాలు తీసుకున్నారు. సదరు నిధులు ఏమైనట్లు, ఎవరెవరు పాత్రధారులు, అసలైన సూత్రధారులెవరు, పక్కదారి పట్టిన నిధులను ఎప్పట్లోగా చెల్లిస్తారు, ఎవరెవరు ఎంత తీసుకున్నారనే విషయాలను లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. ఇదిలా ఉండగా తాము సంఘమిత్రలుగా విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆడిట్ జరిగితే బండారం బట్టబయలు అవుతుందని భావించిన మిగిలిన వీఓ పరిధిలోని సంఘమిత్రలు ఏదో విధంగా వారికి అనుకూలంగా ఉండే ఉన్నతాధికారులకు నగదు రూపంలో దక్షిణ సమర్పించి ఆడిట్ జరగకుండా ఉండేందుకు పావులు కదుపుతున్నారని సమాచారం. ఇదిలా ఉండగా మరి కొన్ని పంచాయతీల్లో సంఘమిత్రలు ఎలాగైనా ఈ గండం నుంచి తమను గట్టెక్కించాలని స్థానికంగా ఉండే నాయకులు, ప్రజా ప్రతినిధులను ప్రాధేయపడుతున్నట్లు తెలుస్తోంది.

స్పందన ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

రాయచోటి : స్పందన ద్వారా అందుతున్న ఫిర్యాదులపై అధికారులు సత్వరం స్పందించి పరిష్కారం చూపాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఏఎస్పీ వీబీ రాజ్ కమల్ ఆదేశించారు. అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు స్పందన ద్వారా 51 ఫిర్యాదులు ఇచ్చినట్లు ఏఎస్పీ వివరించారు.

రోకలి కర్రతో భార్యపై దాడి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని రాచగుడిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి భార్య కృష్ణవేణి తలపై భర్త రామయ్య రోకలి కర్రతో దాడి చేశాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు...రామయ్య(45), కృష్ణవేణి(38) దంపతులకు సుమారు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. కృష్ణవేణి భర్త రామయ్య బతుకు తెరువు కోసం 15 సంవత్సరాల క్రితం కువైట్‌కి వెళ్లి అప్పుడప్పుడు ఇంటికి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో 5 నెలల క్రితం రామయ్య స్వగ్రామానికి చేరుకున్నాడు. అతను ఇంటికి వచ్చినప్పటి నుంచి భార్య, భర్తల మధ్య మనస్పర్థలు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం వాగ్వాదం మొదలై ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో కృష్ణవేణి తలపై రోకలి కర్రతో భర్త రామయ్య బలంగా కొట్టడంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. అధిక రక్తస్రావం కావడంతో భయపడిన భర్త ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడి వైద్యుల సలహా మేరకు తిరుపతికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో పెద్దకూతురు పూజితను భార్య దగ్గర ఉంచి రామయ్య పరారయ్యాడు. కృష్ణవేణి పెద్దనాన్న కుమారుడు వానరాసి రామచంద్రయ్య ఆలస్యంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రభుత్వ పాఠశాల రూపు రేఖలు మారాయి



నాడు–నేడుతో మున్సిపల్ వివేకానంద (ఆర్ ఆర్ లేవుట్) పాఠశాల రూపురేఖలు మారాయి. గతంలో పిల్లలు తరగతి గదిలో కూర్చోవడానికి ఇబ్బందులు పడేవారు. నాడు–నాడు కింద అదనపు గదులు రూ.80 లక్షలతో నిర్మిస్తున్నారు. పాఠశాలలో డిజిటల్ విద్యాబోధన అందిస్తున్నాము. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా బోధన జరుగుతోంది. పది ఫలితాల్లో రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలల్లో మొదటి స్థానంలో నిలిచింది. పదిలో హిమసాయి 584 మార్కులు సాధించి ప్రతిభ చాటింది. ఈ ఏడాది అడ్మిషన్లు 265 పెరిగాయి. విద్యారంగాన్ని గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. నేడు ముఖ్యమంత్రి పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. తల్లిదండ్రులు సంతోషంగా తమ పిల్లలను పాఠశాలకు పంపుతున్నారు.

-రాజేంద్రప్రసాద్, హెచ్ఎం, వివేకానంద మున్సిపల్ పాఠశాల, మదనపల్లె

సొంత ఇంటి కలను నెరవేర్చిన సీఎం జగన్



నాకు వివాహమై దాదాపు ఆరేళ్లయింది. అప్పటి నుంచి నాకు ఇల్లు మంజూరు కాలేదు. ఇంటి స్థలం మంజూరు చేయలేదు. కానీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. అందులోనే హౌసింగ్ తరపున ఇంటిని కూడా మంజూరు చేయించారు. సొంత ఇంటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

- సి. సుప్రియ, నాగేటితిప్ప, ఒంటిమిట్ట

ఒకే రోజు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు



గతంలో ఏదైనా ధ్రువ పత్రాలు పొందాలంటే దరఖాస్తు చేసుకోవడంతోపాటు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందేవి కావు. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో మా పిల్లలకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలని గ్రామ వలంటీర్‌కు చెప్పడంతో ఒక రోజులోనే అందించారు. ఇంత సులభంగా ప్రభుత్వ సేవలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేం.

- బోడిరెడ్డి, బోడుమల్లువారిపల్లె, పీలేరు మండలం

ముగిసిన డాక్టర్ బి.వెస్లీ అంత్యక్రియలు



డాక్టర్.బి.వెస్లీ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రాయలసీమ దయాసిస్ బిషప్ వరప్రసాద్

మదనపల్లె : ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(ఏఎంసీ) మాజీ డైరెక్టర్ డాక్టర్.బి.వెస్లీ అంత్యక్రియలు ముగిశాయి. క్షయవ్యాధి నివారణలో శానిటోరియం ఆస్పత్రిగా ప్రారంభమైన ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ 1912లో ప్రారంభమైతే, అందులో 33 ఏళ్ల పాటు ఏఎంసీ డైరెక్టర్‌గా డాక్టర్.వెస్లీ సుదీర్ఘకాలం సేవలందించారు. ఆరోగ్యవరంలో టీబీ వ్యాధి టీకాలను కనుగొనేందుకు ల్యాబ్ ఏర్పాటుకు కృషిచేశారు. ఆరోగ్యవరం లోకల్ అథారిటీ అభివృద్ధిలో తనవంతుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది మేలో ఏఎంసీ డైరెక్టర్ బాధ్యతల నుంచి ఆయన తప్పుకున్నారు. అనంతరం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వెస్లీ సతీమణి షీలా, రెసిడెంట్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన కుమారుడు రిచర్డ్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఇంటిపట్టునే ఉంటున్న డాక్టర్.బి.వెస్లీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఓ క్రైస్తవ సోదరుడి ఇంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గుండెపోటుతో ఉన్నపళంగా కుప్పకూలిపోయారు. దీంతో హుటాహుటిన ఆయనను ఆస్పత్రికి తరలించేలోపు మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శకుల కోసం ఆరోగ్యవరం రిక్రియేషన్ సెంటర్‌లో ఉంచారు. రాయలసీమ డయాసిస్ బిషప్ రెవరెండ్ వరప్రసాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన చర్చి పాస్టరు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు దేశాయ్ తిప్పారెడ్డి, దొమ్మలపాటి రమేష్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్.ఎస్.రవికుమార్, రాటకొండ బాబురెడ్డి ఉన్నారు.

అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందలూరు(రాజంపేట): ఎన్నికల ముందు దుష్ప్రచారాలు చేస్తూ అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య చిచ్చు పెట్టేలా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కరిముల్లా ఖాన్‌లు సోమవారం నందలూరు ఎస్ఐ అబ్దుల్ జహీర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఎంఆర్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత మేడా రఘునాథరెడ్డిలు టీడీపీలో చేరుతున్నట్లు కొన్ని వాట్సప్ గ్రూపుల ద్వారా నందలూరు మండలం, టంగుటూరుకు చెందిన గుజ్జల ఈశ్వరయ్య దుష్ప్రచారం చేశాడన్నారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని నందలూరు ఎస్ఐకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు సర్పంచ్ మైనుద్దీన్, మన్సూర్ అలీఖాన్‌లు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో ఇద్దరికి గాయాలు



కరెంట్‌షాక్‌కు గురైన కుమార్

మదనపల్లె : కరెంట్‌షాక్‌తో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండ జన్మభూమికాలనీకి చెందిన కె.సుబ్బరత్నమ్మ(58), ఆమె కుమారుడు కె.కుమార్(32) భవన నిర్మాణ పనులు చేస్తూ జీవిస్తున్నారు. సోమవారం యథావిధిగా పట్టణంలోని దిగువకమ్మపల్లె అభ్యుదయ స్కూల్ సమీపంలో పనులకు వెళ్లారు. భవనంపైన నిర్మాణ పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి కుమార్ మొదట విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతడితో పాటు తల్లి సుబ్బరత్నమ్మ సైతం షాక్‌కు గురైంది. ఘటనలో కుమార్‌కు తీవ్రగాయాలు కాగా, గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

రైలు నుంచి జారిపడి డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవర్ కొండా సుమన్‌బాబు

ఓబులవారిపల్లె : చెన్నై– ముంబయి సూపర్ ఫాస్ట్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి కొండా సుమన్ బాబు(33) అనే రైల్వే డ్రైవర్ మృతి చెందారు. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు తిరుపతిలో నివాసం ఉంటున్న కొండా సుమన్ బాబు ఏడేళ్లుగా రైల్వే శాఖలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎర్రగుంట్లలో ఆయన విధులకు హాజరు కావాల్సి ఉండటంతో సోమవారం చెన్నై– ముంబయి సూపర్ ఫాస్ట్ రైలులో రేణిగుంట నుంచి ఎర్రగుంట్లకు స్లీపర్ కోచ్‌లో బయలుదేరారు. ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌లో రైలు కాస్త వేగం తగ్గింది. ఇదే సమయంలో ప్రమాదవశాత్తు సుమన్‌బాబు రైలు నుంచి జారి కిందపడ్డారు. ప్లాట్‌ఫాంపై అరక్కోణం ప్యాసింజర్ రైలు కోసం వేచి ఉన్న ప్రయాణికులు గమనించి వెంటనే రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన అక్కడికి చేసుకొని గాయపడిన సుమన్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహన్ని రైల్వే అంబులెన్స్‌లో తిరుపతికి తరలించారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు



టిప్పర్‌ను అడ్డగిస్తున్న గ్రామస్తులు

వీరబల్లి (రాయచోటి టౌన్) : మండల పరిధిలోని గడికోట గ్రామం వేల్పుల మిట్ట గ్రామప్రజలు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిని అడ్డగించి అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో అక్రమంగా ఇసుకను తరలించడం ఎక్కువ కావడంతో తమ పొలాల వద్ద నదిలోని నీరు అడుగంటి పోతోందని గ్రామస్తులు అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించారు. దీంతో గ్రామస్తులే పంట పొలాల వద్ద కాపు కాసి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిని పట్టుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారి ఆట కట్టించాలని వారు కోరుతున్నారు.

శివకుమార్‌శర్మకు దైవజ్ఞ భూషణ అవార్డు



దైవజ్ఞ భూషణ అవార్డు అందుకుంటున్న వేదపండితుడు శివకుమార్‌శర్మ

మదనపల్లె సిటీ : జ్యోతిష్యశాస్త్రంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు మదనపల్లెకు చెందిన వేదపండితుడు శివకుమార్‌శర్మకు మహారాష్ట్ర రాష్ట్రం ఉజ్జయిని విక్రమాదిత్య యూనివర్సిటీ దైవజ్ఞ భూషణ అవార్డును అందజేసింది. ఉజ్జయినిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మధ్య ప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, యూనివర్సిటీ వీసీ అఖిలేషకుమార్ పాండే చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శివకుమార్‌శర్మ అవార్డు అందుకోవడం పట్ల పలువురు వేదపండితులు, బ్రాహ్మణ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు యత్నించి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన బి.వెంకటనారాయణ కుమార్తె బి.శ్వేతవీణ(22) డిగ్రీ పూర్తిచేసింది. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవిస్తోంది. అయితే ఆమె శానిటోరియంకు చెందిన ఓ యువకుడిని గత కొంతకాలంగా ప్రేమిస్తోంది. ఈ క్రమంలో సోమవారం ప్రియుడి తల్లి శ్వేతవీణకు ఫోన్‌చేసి మందలించడంతో పాటు ప్రేమపెళ్లికి అంగీకరించకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. అదేవిధంగా గుర్రంకొండ ఖాజీవాడ వీధికి చెందిన అక్బర్‌బాషా భార్య ఎస్.కే.హాజీరా(22) కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడి విష ద్రావణం తాగింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సారా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు

మదనపల్లె : పట్టణంలోని ఈశ్వరమ్మకాలనీ మాలిక్ ఫంక్షన్ హాల్ సమీపంలో సారా విక్రయిస్తున్న ఆర్.వి.నగర్‌కు చెందిన బాణావత్ నర్సమ్మ (48)ను అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు. ఆమె నుంచి 10లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అన్నదాత గుండె చెరువు.!

- తెగిన చెరువుతో నీటి పాలైన రైతన్నల రెక్కల కష్టం
- మట్టిపాలైన పెట్టుబడులు
- అన్నదాతల కలవరం
- నష్టంపై జిల్లా కలెక్టరుకు నివేదిక
- ఇరిగేషన్ ఈఈ సురేంద్ర రెడ్డి వెల్లడి



తెగిన శీతివారిపల్లె చెరువు

కురబలకోట : మండలంలోని దిగవశీతివారిపల్లె పక్కనున్న శీతివారిపల్లె చెరువు తెగిన సంఘటనపై సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. ఆదివారం సాయంత్రం ఈ చెరువు తెగి వరదలా ప్రవాహం పోటెత్తిన విషయం తెలిసిందే. తహసీల్దార్ ఎం.భీమేశ్వరరావు, వ్యవసాయాధికారి రాధ సంయుక్తంగా కట్ట తెగడం, పంట నష్టం వివరాలను బాధిత రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయకట్టు కింద 19 మంది రైతుల పంటలు నీటిపాలైనట్లు గుర్తించారు. వరి రెండు ఎకరాలు, వేరుశనగ నాలుగు ఎకరాలు, మొక్కజొన్న ఎనిమిది ఎకరాల్లో నష్టపోయినట్లు విచారణలో వెల్లడైంది. ఎక్కువగా భూపాల్ రెడ్డి పంటలు నష్టపోయారు. భూమిపై మట్టి మేటలు పేరుకుపోయాయి. పొలాన్ని యథాస్థితికి తెచ్చుకోవడం ఎలా అని ఆయన అధికారుల ముందు విలపించారు. 30 మంది రైతుల వ్యవసాయ మోటార్లు మట్టితో మూసుకుపోయాయి. ఈ చెరువుకు పైగా వెళుతున్న హంద్రీనీవా కాలువ కృష్ణా జలాలు లీకేజీ ద్వారా భారీగా నీళ్లు ఈ చెరువుకు చేరడంతో ఇది తెగడానికి కారణంగా చెబుతున్నారు. సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. తగిన నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సహకారంతో బాధితులను ఆదుకుంటామన్నారు. ఇదిలా ఉండగా తెగిన చెరువు నీరు దిగువన ఉన్న అప్పాలమ్మ చెరువుకు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఇరిగేషన్ అధికారులు హిటాచీ సాయంతో చెరువు పక్కన గ్రామస్తుల రాకపోకలకు వీలుగా కొత్తగా దారి సౌకర్యం కల్పించారు. మదనపల్లె ఇరిగేషన్ ఈఈ సురేంద్ర రెడ్డి స్వయంగా పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు, వాహనాల రాకపోకలకు దారి ఏర్పాటు చేశారన్నారు. వెంటనే తెగిన చెరువు మరమ్మతు పనులను కూడా యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఈ చెరువుపైగా హంద్రీనీవా కాలువ ద్వారా నీళ్లు సాగుతుండడంతో తిరిగి ఈ చెరువును పూర్తి స్థాయిలో నింపుతామని తెలిపారు. ఇందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

చెరువు తెగి నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. పంటల నష్టం గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. చెరువు తెగడం దురదృష్టకరమన్నారు. పంటలు దెబ్బతింటే రైతులు ఎంత వేదన అనుభవిస్తారో తెలుసన్నారు. నియోజక వర్గ ప్రజలు తన కుటుంబమన్నారు. ఎవరికి కష్టం నష్టం జరిగినా తనకు జరిగినట్లే భావిస్తానన్నారు. రైతులు అధైర్య పడవద్దని తగిన రీతిలో ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.



నేలకొరిగిన వరి పంట